కథానిక

# కటిక ఎంకటేశు

"శ్రీమూర్తి"

మాంచి గురిమాసి చెవిదాకా రబ్బరు లాక్కొట్టాడు ఎంకటేశు "క్యాట్ బాల్"తో. దెబ్బతో చింతచెట్టు చిటారు కొమ్మనున్న పొన్నంగి ఇట్టే నేలవాలింది. ఓ కొంతసేపు గిజగిజా కొట్టుకుంది. తరువాత నీలుక్కుపోయింది. వాడు దాన్నెత్తుకున్నాడు. నోటినిండా నీరూరింది. గుక్కిళ్ళు మింగుకున్నాడు. గుంటలుపడ్డ కళ్ళలోంచి ఉత్సాహం తొణుక్కుమంది. హస్త లాఘవంలో అంతటి అఖండుడు వాడు!

ఆ దారినే పురాణం చెప్పే శాస్తుర్లు పాపనాశం స్నానానికి వెడుతూన్నాడు. ఓమారీవేపు చూశారు.

"శివశివ!" ఆయన ఓక్షణం కండ్లుమూసుకున్నాడు. ఎంకటేశువేపు చురచురా చూశాడు. ఏదో గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

"కటికముండాకొడుకు, ఛూ!" ఉమ్మిలో కలిసిన ఈముక్కలుమాత్రం వినిపించాయి.

ఎంకటేశు నవ్వుకున్నాడు. ఆ నవ్వులో "రోజూచచ్చేవాళ్ళకు ఏడ్చేవాళ్ళెవ్వరు?" అనే విముఖత్వం గర్భితం అయివుంది. అయినా తన్నిలాఎప్పుడూ శాస్తుర్లు ఎందుకు అసహ్యించుకుంటారో ఎంకటేశు ఆలోచనకు అందిందికాదు. ఏం? తనేం తప్పు చేస్తున్నాడు? పిట్టల్ని కొట్టుకుని కడుపు నింపుకోవడం తన జీవనమే అయినప్పుడు దాన్ని విడిచి బ్రతకడం ఎలాగు? వేరే జీవనం ఎలా దొరికేట్టు? పోనీ అనుకుంటే ఈ చీదరించుకుండే వాళ్ళలో ఒక్కరైనా పట్టెడు పెట్టేవారున్నారా?

ఎంత ఆలోచించినా ఎంకటేశుకు మార్గాంతరం తోచిందికాదు.

"దొంగ నాయాళ్ళు! అంతా చెప్పేవాళ్ళే" ఓమారు పేదకోపం చూపిస్తూ అగ్గిరాముడవుతాడు.

"ఏటి పాపమో, ఏటి బతుకో..." మరోమారు ఉస్సురంటాడు.

మానవునిలోని సున్నితమైనగుణాలు వాడిలో వృద్ధిచెందడానికి ఎన్నడూ అవకాశం రాలేదు. "ఇంచెవిటో, ఏటిదయో, ఇంచని ఊరుక్కుంటే బతికేదెట్టా? నన్నెరుదయదల్చుతారు?" ఈ ప్రశ్నలకు వాడెన్నడూ తృప్తికరమైన సమాధానం పొందలేదు.

ఎంకటేశు మరో నాలుగు పొన్నంగిపిట్టల్ని కొట్టాడు. కొన్ని చచ్చాయి. కొన్ని ఇంకాచస్తున్నాయి. "ఎదవ ఎండ అప్పుడే పొద్దునెత్తెక్కుద్ది" ప్రకృతిమీద నోరుచేసుకున్నాడు ఎంకటేశు. పిట్టలన్నిటినీ సంచిలో వేసుకుని బయలుదేరాడు. మిట్టమధ్యాహ్నపుటెండలు దూరాన ఎన్నో మృగతృష్ణల్ని సృష్టించాయి. రంయిమని వెడిగాడ్పులు చింతచెట్లమధ్య గుసగుసలుపోతున్నాయి.

"ఏరా కటికగాడిద, వాటినట్లా నిలువునా ప్రాణంతీస్తే పాపం గదుట్రా?" స్నానం చేసుకుని కడవమీదెట్టుకుని తిరిగివస్తూ అన్నాడు పాపనాశం.

"ఏంటి చేసేది బాబూ, పొట్ట!"

"థా. భ్రష్టా వేరేపని చూసుకోలేవట్రా?"

"ఏందొరుకుద్దిబాబూ? ఎట్టాదొరుకుద్ది?"

"ఒరేయ్ వాల్మీకి మహర్షి క్రౌంచపక్షుల్ని కొడుతున్న నీలాటి కిరాతకుడితో ఏమన్నాడో తెలుసా?"

"వాలిమీకి వోరు? ఏం పచ్చులు?"

ఎంకటేశు బోయవాడిగా, తాను వాల్మీకి మహర్షిగా ఓ మహోపన్యాసం దంచేద్దామనుకున్న పాపనాశంగారికి ఇప్పటివాడి అమాయకత్వం తీరని ఆశాభంగం కలిగించింది.

"ఛీ, మూర్ఖుడా" పాపనాశం శాపనార్థాలు పెడుతూ చరచరా వెళ్ళిపొయ్యాడు.

"ఏంటి పాపవో, ఛస్తుంటే." ఎంకటేశం వెళ్ళిపొయ్యాడు.

నాటి సాయంకాలం-రోజూ మల్లేనే- కృష్ణ మందిరంలో పురాణం జోరుగా సాగుతోంది. పాపనాశం శాస్త్రుర్లు రాగ, భావయుక్తంగా భారతపురాణ కాలక్షేపం చేస్తున్నారు. శ్రోతలందరూ చెవులప్పగించి వింటున్నట్టున్నారు.

ధర్మవ్యాధుడి ఉపాఖ్యానం చెబుతున్నారు పాపనాశంగారు.

"అంతట ఆ గృహిణి వాకిట క్రోధోద్దీపిత మానసుండై మండిపడుచున్న మునింగనుంగొని మహర్షీ, నీ తపమేల కాల్పనా? క్రోధముంజయింపలేక గృహిణి ధర్మముందెలియక అజ్ఞానంబున మిట్టిపడుచున్న నీవేటి తపసివి? ఈ ఊర ధర్మవ్యాధుండను ఛండాలుండు, మాంస విక్రేతగలడు తడ నీ యజ్ఞానంబు బాపువేళంబ జనుమన..."

"ఎదవగాడిద, సీ, ఈడకొచ్చావంట్రా?" మందిరం వెలుపల ఓ మూలగా కూర్చోబోతున్న ఎంకటేశుని ఛీత్కారం చేశాడు మునసబు రామయ్య.

"ఎవడు ఎంకటేశా? ఆ వెధవను ఎందుకు రానిచ్చారు?" కరణం వెంకటప్ప అధికారం సూసిస్తూ కసిరి కొట్టాడు.

"ఎవడూ, ఆ భ్రష్టుడా? ఆపాడు ముండాకొడుకుని మందిరంలోకి రానిచ్చారా? శివ, శివ మందిరం మయిలపడ్డది. ఇహ పురాణం సాగించడం నావల్లకాదు" విషయం పాపనాశంగారి దాకా వెళ్ళేప్పటికి ఆయన తలక్రిందులయి పుస్తకం అప్పుడే మూసివేశాడు కూడా.

"వెధవ","గాడిద" "బ్రష్టు ముండాకొడుకు" తిరణాల్లో కుక్కగతి అయింది పాపం ఎంకటేశు గతి!

"ఎరక్కొచ్చాను, చమించండి" వాడిన తోటకూరకాడలాగా మొహం వ్రేళ్ళాడేసుకుని వెళ్ళిపొయ్యాడు ఎంకటేశు.

"ఇహ నీవు గానివ్వవయ్యా శాస్త్రుర్లూ" కరణం వెంకటప్ప భరోసా ఇచ్చాడు.

ధర్మవ్యాధుడి ఉపాఖ్యానం పూర్తయింది. ఎవరికెంత అర్థమయిందో యేమో ఒక్కరికీ చీమకుట్టినట్టు లేదు. జీవన గౌరవాన్ని గూర్చి ధర్మవ్యాధుడెంత గొప్పగా చెప్పాడో ఎవరూ ఆలోచించ ప్రయత్నించలేదు. పురాణం చాలించారు. అందరూ ఇండ్లముఖం పట్టారు.

ఏండ్లు గడిచాయి. ఎంకటేశు ఎప్పటి ఎంకటేశే! వాడి క్యాట్‌బాలూ, పిట్టలూ వాడూను. పాపనాశంగారికి ఉన్నట్టుండి ఓరోజు పొలాన్నుండి వస్తుంటే ఎడంకాలు, ఎడంచేయి చచ్చుబడ్డాయి!

"అమ్మో, నా ప్రాణం!" శాస్త్రుర్లు గొల్లుమన్నాడు. వారూ, వీరూ చేరి ఎలాగో ఆయన్ని ఇంటికి చేర్చారు.

"అయ్యో నా బిడ్డలు, నా సంసారం!" ఇంటికి రాగానే బావురుమన్నాడు. నాటువైద్యుడు నరసింహాచార్లకు కబురంపించారు. వచ్చిచూసి, "ఇది పక్షవాతం" అన్నాడు.

"పక్షవాతం!" పొలికేక పెట్టాడు శాస్త్రుర్లు.

"ఔను, వృద్ధాప్యం కోలుకోవడం కష్టమే!"

"అయితే, ఏం మందులేదా? నీ వైద్యం పాడుగాను!"

"ఉంది. పావురాయిని చంపి, దాని రక్తం పూస్తే తగ్గుతుంది."

"ఆఁ!" శాస్త్రుర్లుకు ప్రాణాలు లేచివచ్చాయి. వెంటనే అక్కడున్న మునసబు ఎంకటేశుకోసం కబురంపించాడు. వాడొచ్చాడు.

"ఒరేయ్! ఎంకటేశుగా, రెండు పావురాళ్ళు వీలైతే మూడు-మాంచివి-మాంచివిగా -సూసి- కొట్టి తీసుకరా, మా నాయనవిగదూ" శాస్త్రుర్లు ప్రాధేయపడ్డాడు.

ఎంకటేశు తటపటాయించాడు.

"అట్లా చూస్తావేరా, మొద్దూ ముందుకొట్టి తీసుకురాక" శాస్త్రుర్లు కసిరాడు.

"కదలవేంరా గాడిద" మునసబు పెళ్ళుమన్నాడు.

"పావురాళ్ళను చంపితే పాపంగదండీ" భార్య మెల్లిగా శాస్త్రుర్లను హెచ్చరించింది.

"ఆసి భ్రష్టా, నేను ఛస్తే నీ కిష్టమేటే ముండా పాపమో, పుణ్యమో—ముందు ఛస్తుంటే" అగ్గిరాముడయ్యాడు శాస్త్రుర్లు.

ఎంకటేశు బయలుదేరాడు.

"...మంచివిగా చంపితీసుకురా" అన్న ముక్కలు వెళ్ళే ఎంకటేశుకి వినిపించాయి.